క్లుప్తంగా

గురుకులం విద్యార్థినికి ప్రతిభా పురస్కారం



మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న దుర్గాగ్రీష్మ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మహాత్మా జ్యోతీరావ్ పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని శెట్టి దుర్గాగ్రీష్మ జిల్లా స్థాయి అవార్డును కైవసం చేసుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ వి.పావన్య వివరాలను శనివారం విలేకరులకు తెలిపారు. గత ఏడాది నవంబరులో 9, 10 తరగతుల కేటగిరీలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ సమగ్రశిక్ష నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాల చేతుల మీదుగా గ్రీష్మకు రూ.2 వేల నగదు బహుమతి, సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష ఏఎంఓ పిల్లి రాంబాబు పాల్గొన్నారు.

దాతల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న శ్రీనివాస్

కాజులూరు: దాతల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఇతరులకు సహాయపడాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. కళాశాల నుంచి గత ఏడాది ఇంటర్మీడియెట్ మంచి మార్కులు సాధించి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రూ.ఐదు వేలు విలువ చేసే యాప్‌సెట్, నీట్ తదితర పోటీపరీక్షల స్టడీమెటీరియల్‌ను గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి సమకూర్చగా వాటిని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ చేతుల మీదుగ శనివారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరు శ్రీసత్యభాస్కర జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత ట్యాబ్‌లను సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ చేతులు మీదుగా అందజేశారు. హెచ్ఎం త్రిమూర్తులు అధ్యక్షతన పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి దంపతులు, ఎంపీటీసీ మండ సుమలత మాట్లాడుతూ పేదల విద్యకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తేతలి రాజారెడ్డి, మండ నాగిరెడ్డి, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతకు అభినందనలు



దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న నాయకులు

కాజులూరు: గ్రామీణ ప్రాంతాల్లో పలు ఆటల పోటీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం పర్చడంలో యువ సంఘాలు నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయమని గొల్లపాలెం శ్రీ కాకతీయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెల్లుబోయిన రాంబాబు అన్నారు. ఆర్యావటంలో శనివారం రాత్రి జరిగిన స్థానిక బాబి ఫ్రెండ్స్ యూత్ 24వ వార్షికోత్సవంలో రాంబాబు, గొల్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా బాబిఫ్రెండ్స్ యూత్, ఇంపెక్ట్ ఇంటర్‌నేషనల్ క్లబ్ సభ్యులు సంయుక్తగా రంగవల్లి పోటీల్లో నిర్వహించి సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా జ్ఞాపికలను అందజేశారు. గ్రామంలోని పలువురు పేద వృద్ధులకు దుస్తులు, దుపట్లు పంపిణీ చేశారు. చిన్నారులు, యువకులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు మండల సమావేశం

కె.గంగవరం: స్థానిక మండల సమావేశపు హాలులో ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతను సోమవారం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

అధిక వినియోగం అనర్థమే..

- రసాయన ఎరువుల వాడకంపై జాగ్రత్తలు
- ఎక్కువ ఎరువులతో సారవంతం కోల్పోతున్న భూములు



పొలంలో ఎరువులను వెదజల్లుతున్న రైతు

రామచంద్రపురం రూరల్: ఎరువులు అధిక వినియోగం వల్ల పంటకు నష్టం కలుగుతుంది. రసాయన ఎరువులు అధికంగా ఉపయోగిస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనే అభిప్రాయం చాలా మంది రైతుల్లో ఉంది. అధిక మొత్తంలో ఎరువుల వాడకం వల్ల భూములు సారవంతం కోల్పోవడంతో పాటు మనుషుల ఆరోగ్యానికి హానికరంగా మారతాయి. మార్కెట్‌లో లభిస్తున్న కాంప్లెక్స్ ఎరువులు ఏ పంటకు, ఏ సమయంలో, ఎలా వినియోగించాలో అర్థంకాక రైతులు ఇష్టారీతిగా వాడుతుంటారు. దీంతో మొదటికే మోసం వస్తోంది. ఈ నేపథ్యంలో రసాయన ఎరువుల వినియోగంపై రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ పలు విషయాలు తెలిపారు.



సత్యప్రసాద్, మండల వ్యవసాయ అధికారి

కాంప్లెక్స్ ఎరువులన్నీ ఒకే రకం కాదు

కాంప్లెక్స్ ఎరువులన్నీ ఒకటి కాదని రైతులు గుర్తించాలి. నత్రజని, భాస్వరం, పొటాషియం మిశ్రమంతో కాంప్లెక్స్ ఎరువుల తయారవుతాయి. పొటాష్ పరిమాణంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు నిర్ణయిస్తారు. ఏ ఎరువు బస్తా మీదనైనా దాని మిశ్రమాల విలువ శాతం రూపంలో ముద్రిస్తారు. పంటలోని పోషక లోపం బట్టి కాంప్లెక్స్ ఎరువులు వాడాలి.

ఎరువు వెదజల్లే పద్ధతి

పంట నాటడానికి ముందు గానీ, నాటే సమయంలో ఎరువును పొలంలో పడేలా చల్లడాన్ని వెదజల్లే పద్ధతి అంటారు. మొక్కలు పొలం నిండా దగ్గర దగ్గరగా ఉండి, వరుసలో లేని పైర్లకు, మొక్క వేర్లు భూమిలో అల్లుకుని ఉండే పైర్లకు ఈ పద్ధతి బాగా పనిచేస్తుంది. ఇది వరికి అనువైన పద్ధతి. నీరు ఎక్కువగా నిలిచి ఉన్న పొలంలోగానీ, పొడినేల మీదగానీ ఎరువులు చల్లితే వృథా అయ్యే అవకాశం ఎక్కువ

మొక్క వేర్ల వద్ద..

ఎరువులు వెదజల్లడం కన్నా మొక్క వేర్ల వద్ద వేయడం మేలు. తక్కువ ఎరువులతో అధిక పోషకాలు మొక్కకు అందేలా చేయవచ్చు. దూరదూరంగా మొక్కలు ఉన్నప్పుడు, వేర్లు తక్కువ విస్తీర్ణంలో వ్యాపించినప్పుడు, భూసారం తక్కువ ఉన్న నేలలకు ఈ పద్ధతి అనుకూలం. మొక్కజొన్న, మిర్చి, పత్తి ఆరుతడి పంటలకు లాభదాయకం

అధికంగా ఎరువులు వాడకం

నత్రజని, భాస్వరం, పొటాషియం పోషకాలను ఆహార పంటలకు 4:2:1 వాడాలని శాస్త్రవేత్తలు సిఫారసు చేస్తున్నారు. రైతులు మాత్రం భాస్వరం, పొటాషియంలు తక్కువగాను, నత్రజని సిఫారసు చేసినదానికంటే రెండున్నరరెట్లు అధికంగాను వాడుతున్నారని అంచనా. ఎరువులు అమ్మకాల్లో మార్జిన్ తక్కువగా ఉండడంతో కల్తీ, నకిలీ ఎరువులు అమ్మే అవకాశం ఉంది. రైతులు తమ సంఘాల ద్వారా కంపెనీ డీలర్ల ద్వారా కొనుగోలు చేయాలి.

చేనేత విభాగం కమిటీలో సముచిత స్థానం



అతికెల శంభులింగం



శలా సత్య సుబ్రహ్మణ్యం



గోరు సత్యనారాయణ



బేతా వెంకటేశ్వరరావు



చల్లా వీర్రాజు



కర్రా వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా కమిటీలో మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు సముచిత స్థానం దక్కింది. పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లా కమిటీని ప్రకటించింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా కపిలేశ్వరపురం మండలం నల్లూరుకు చెందిన అతికెల శంభులింగం, ప్రధాన కార్యదర్శిగా అంగరకు చెందిన శలా సత్య సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. కార్యదర్శులుగా మండపేట పట్టణానికి గోరు సత్యనారాయణ, మండపేట మండలం ఏడిదకు చెందిన బేతా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కపిలేశ్వరపురం మండలం నేలటూరుకు చెందిన చల్లా వీర్రాజు, రాయవరానికి చెందిన కర్రా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. చేనేత కార్మికులకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే జగన్ ధ్యేయం

వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్



గొల్లపాలెంలో జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న సూర్యప్రకాశ్

కాజులూరు: పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గొల్లపాలెం పీఏసీఎస్ కార్యాలయంలో సాహకార సంఘం ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును శనివారం ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పథకాలతోపాటు ప్రజా ఆరోగ్య పరిరక్షణకోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సు సేవలు, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటివెలుగు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,032 విలేజ్ హెల్త్‌సెంటర్లు, 17 మెడికల్ కళాశాలలు నిర్మించి ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో 53800 స్పెషలిస్టు డాక్టర్లను, నర్సులను నియమించారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. సహకారసంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో ఐదు జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయగా అందులో ఒకటి గొల్లపాలెంలో ప్రారంభించామన్నారు. పీఏసీఎస్ సీఈఓ మూలారెడ్డి, మండల, గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ మంగతాయారు



తహసీల్దార్ ప్రకాశ్‌బాబును సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

రాయవరం: ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారులు అన్నారు. మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ మాట్లాడుతూ పేదరికం ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న సదుద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు అధికారుల సహకారం కూడా అవసమేనన్నారు. అన్ని శాఖల అధికారులు వారివారి పరిధిలోని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, ఎన్ఆర్ఈజీఎస్, విద్యా తదితర శాఖల ప్రగతిని సభకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ సేవా పురస్కారం పొందిన తహశీల్దార్ కేజే ప్రకాశ్‌బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, విప్ కర్రి విజేత, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

పీడీఎస్‌యూ పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరించిన సిద్ధూ తదితరులు

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ సమాన ప్రమాణాలతో విద్య, సామాజిక న్యాయం అమలు చేయాలని కోరుతూ వచ్చే నెలా మూడో తేదీన ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్టు పీడీఎస్‌యూ నాయకులు బి.సిద్ధూ పిలుపు నిచ్చారు. ఈమేరకు జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమ పోస్టర్‌ను ఆయన శనివారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందన్నారు. అది పాఠశాల విద్యని ధ్వంసం చేసిందని, పాఠ్యాంశాలను కాషాయీకరిస్తుందని, పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకూ అనేక సమస్యలు ఉన్నాయన్నారు. యూనివర్సిటీలో స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా యూనివర్సిటీ గ్రాండ్ కమిషనర్‌ను రద్దు చేసిందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు సమరశీల పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానం 2020లో విద్యార్థులు పాఠశాలకు రావాలనే నిబంధన లేదని. ఈ నూతన జాతీయ విద్యా విధానం లో విద్యా వ్యాపారాన్ని నిషేధించలేదని, ఈ చట్టంలో కుల, మత, భాషాలపై వివక్షలు విద్యలో ప్రవేశ పెట్టారని. ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రవేశాల విషయంలో రిజర్వేషన్లు కోసం కనీసం ప్రస్తావన లేదన్నారు. ఈ విధానం లో రాష్ట్రాల ఫెడరల్ హక్కులకు వ్యతిరేకంగా, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి వ్యతిరేకంగా తయారు చేశారన్నారు. అఖిల భారత విద్యా హక్కుల వేదిక పిలుపుమేరకు ఫిబ్రవరి 3న ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నిరసన ప్రదర్శన, సభలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పీడీఎస్‌యూ నాయకులు అభిషేక్, బాలాజీ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



సుందరపల్లిలో విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ప్రముఖులు

కె.గంగవరం: సుందరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గ్రామానికి చెందిన చీరాలలో స్థిరపడిన అడపా సత్యనారాయణ జ్ఞాపకార్థం శనివారం నగదు బహుమతులను అందజేశారు. ఏటా పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అడపా సత్యనారాయణ కుమార్తె మొఖమాటం మహీజా, హనుమంతరావు నాయుడు దంపతులు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. గత పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు, ప్రస్తుత పదో తరగతిలో అంతర్గత పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.10వేలు విలువైన నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. దాతల కుటుంబ సభ్యులు పెద్దింశెట్టి లెనిన్‌బాబు, తోటకూర సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రగతి పథంలో నడవాలని ఆకాంక్షిస్తూ జీవించిన అడపా సత్యనారాయణ జ్ఞాపకార్థం నగదు బహుమతులందజేస్తున్నామన్నారు. దాతలను హెచ్ఎం చలపతిరావు, సర్పంచ్ సలాది లక్ష్మీశిరీష, ఎంపీటీసీ తాడాల జానకిరామయ్యరాజు, పెద్దలు అడపా బుజ్జీలు, అడపా సత్తిబాబు, రెడ్డి జయరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర



ద్రాక్షారామలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద, ఆదివారపుపేట, ద్రాక్షారామ గ్రామాల్లో శనివారం మండల ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచులు నాగిరెడ్డి సతీష్‌రావు, నక్కిన దొరబాబు, కొత్తపల్లి అరుణల అధ్యక్షతన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అయ్యాజీ వేమా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దూడల శంకరనారాయణ, జిల్లా కో కన్వీనర్ సలాది శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల సత్యనారాయణ, రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు వెన్నపు ధనరాజు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటలక్ష్మి, రైల్వే బోర్డు జోనల్ మెంబర్ పెయ్యల రాంబాబు, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం

- పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధులు కావాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాజమహేంద్రవరంలోని సంహిత డిగ్రీ కాలేజ్ కన్వెన్షన్ హాలులో నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన పార్టీ స్టీరింగ్ కమిటీ నాయకులు, ముఖ్యనేతలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కుల, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోను అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గత పాలకుల మాదిరిగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత మర్చిపోకుండా 99.5 శాతం మేరకు అమలు చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనన్నారు. వీటన్నిటినీ ప్రజలలోకి తీసుకువెళ్లి, వారిని చైతన్యపర్చడంతోపాటు ప్రతిపక్షాలు ఆడే ఓట్ల రాజకీయాలపై కూడా వారికి అవగాహన కలిగించాలన్నారు. రాబోయే ఎన్నికలలో ఎలాగైనా సరే అధికారంలోకి రావాలనే దురాశతో చంద్రబాబు అండ్ కో పనిచేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలలోను మనమే విజయం సాధించాలనే సంకల్పంతో జగనన్న తీసుకున్న లక్ష్యాన్ని సాకారం చేయడమే మన బాధ్యతగా చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు.

దివాన్‌చెరువులో రూ.13.20 కోట్లతో అభివృద్ధి

రాజానగరం: మండలంలోని దివాన్ చెరువులో గడచిన నాలుగున్నరేళ్లలో రూ.13.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ గ్రామంలో అభివృద్ధి పనులకు కేవలం రూ. 54 లక్షలే వెచ్చించారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకు రావాలని, సంక్షేమ పథకాలు కొనసాగేలా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, పలివెల స్వామి, యర్రంశెట్టి ధర్మరాజు, మార్గాని శ్రీను, పీటర్, వల్లభశెట్టి సత్యనారాయణ, ఆకుల శ్రీను, పాల్గొన్నారు.

స్వతంత్ర కౌన్సిలర్ వైఎస్సార్ సీపీలో చేరిక

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పురపాలక సంఘం 7వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ ఎస్.సతీష్ వైఎస్సార్ సీపీలో చేరారు. మండపేటలో శుక్రవారం మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు హాజరైన సతీష్ ఆకర్షితులై కార్యక్రమం ముగిసిన తర్వాత రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పలువురు వైఎస్సార్ సీపీ ప్రముఖులు సమక్షంలో పార్టీలో చేరారు. సతీష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పట్టణాభివృద్ధికి చేస్తున్న కృషికి ఆకర్షితులయ్యానన్నారు. వారి ప్రోత్సాహంతో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం



ఎంపీడీఓ ఐదం రాజు తదితరులను సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని 12 గ్రామాల్లో విశేష సేవలందిస్తున్నందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులు మీదుగా సేవా పురస్కారాలను అందుకున్న అధికారులు, ఉద్యోగులను మండపేట వ్యాయామోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఎంపీడీఓ ఐదం రాజు, ఏఓ వీఎన్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ఎస్‌వీవీ గోపాల్‌లను ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ×ఆడుదాం ఆంధ్రా వేదిక× వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ శాంతి, రిటైర్డ్ హెచ్ఎం గెడా శ్రీనివాస్, జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎన్ అప్పారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్ వీర్రాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ సత్యనారాయణ, జోన్ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణారావు, హెచ్ఎం ఆర్ నాగకుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి



మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు కోరారు. ఆ మేరకు శుక్రవారం మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. 25 ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించి ప్రభుత్వ ఉద్యోగావకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని డీఎస్సీ 1998 టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి రాంబాబు, కోశాధికారి టీవీవీ సత్యనారాయణ, నాయకులు జి.వెంకట్రావు, వి.సుబ్బారావు తెలిపారు. తమ సర్వీసును 62 ఏళ్లకు పెంచాలన్న విజ్ఞప్తిని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి విశ్వరూప్ చెప్పినట్టు నాయకులు తెలిపారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, టేకి గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామిని ఆలయ అర్చక బృంద సభ్యులు విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, మాచర, కోరుమిల్లి తదితర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

కాపర్ వైరు చోరీపై కేసు

బిక్కవోలు: కాపర్ వైరు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ చెందిన గమ్మిల్ల వెంకటరావుకు రంగాపురం గ్రామంలోని 3.5 ఎకరాలు పామాయిల్ తోట ఉంది. దానిని సింగంపల్లి గ్రామానికి చెందిన వీర వెంకట రమణ చూసుకుంటున్నారు. అయితే ఈ నెల 26 తేదీ రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎలక్ట్రికల్ ట్రాన్స్ ఫార్మర్‌లోని రాగి వైర్లను దొంగిలించిపోయారని, దాని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతులకు న్యాయం చేస్తాం

రంగంపేట: ఆయిల్‌పామ్ సాగు రైతులకు గిట్టుబాటు ధర విషయంలో న్యాయం చేస్తామని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి అన్నారు. శనివారం రంగంపేట–వడిశలేరు గ్రామాల మధ్య ఏడీబీరోడ్డు పక్కన ఉన్న గన్ని వ్యవసాయ క్షేత్రం వద్ద జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆయిల్‌పామ్ సాగు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని కారణాల వల్ల టన్ను పామాయిల్ గెలల ధర రూ.23 వేల నుంచి రూ.12400 లకు పడిపోయిన మాట వాస్తవమేనని, దీనిపై కనీస గిట్టుబాటు ధర కోసం తాము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. జిల్లా పామ్ ఆయిల్ సాగు రైతుల ప్రతినిధి బృందాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో చర్చించడానికి వేదికను ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర పామాయిల్ రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సత్తి రామారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా దిగుమతి సుంకాన్ని 40 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గించడంతో పామాయిల్ గెలల ధర సగానికి సగం తగ్గిపోయిందన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు పి.బుజ్జిబాబు మాట్లాడుతూ కనీస ధరను టన్నుకు రూ.18 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.